నీలగిరిని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతా

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ వద్ద రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన తదితరులు

నల్లగొండ టూటౌన్: ప్రజలకు కావల్సిన అన్ని మౌలిక సదుయాపాయాలు కల్పించి నల్లగొండ(నీలగిరి)ను మున్సిపాలిటీని ఆదర్శంగా పట్టణంగా తీర్చుదిద్దాతానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల నుంచి రామగిరి సెంటర్ వరకు రూ.1.30కోట్లతో, శివాజీనగర్ నుంచి చందమామ అపార్ట్‌మెంట్ వరకు రూ.90 లక్షలతో చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, పేదలందరికీ ఇందిరిమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. గ్రామ సభలు పెట్టి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. గత ప్రభుత్వ హాయాంలో మాదిరిగా కాకుండా ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ మేలు జరుగుతుందన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్నివర్గాలకు సంక్షేమం సాధ్యమన్నారు. చిన్న, చిన్న పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ యంత్రాంగమే ప్రజల వద్దకు వస్తుందన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి మార్పులు, చేర్పులు తదితర వాటిపై జిల్లా కలెక్టర్‌కు హరిచందనకు మంత్రి పలు సూచనలు చేశారు. అదేవిధంగా పండ్ల వ్యాపారుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు యామ కవితాదయాకర్, బోయినపల్లి శ్రీనివాస్, ఖయ్యూంబేగ్ పాల్గొన్నారు.



శివాజీనగర్‌లో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

బసవేశ్వరుడి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

నల్లగొండ పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద మహాత్మా బసవేశ్వరుడి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ వీరశైవలింగాయత్, లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తొలి సంఘ సంస్కర్త అయిన బసవేశ్వరుని విగ్రహానికి ప్రభుత్వ పరంగా జిల్లా కోర్టు ఎదుట స్థలం కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ కౌన్సిలర్ బొజ్జ నాగరాజు, సంఘం జిల్లా అధ్యక్షుడు పొగాకు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ధర్మిశెట్టి కోటి, కర్నె వరప్రసాద్, ఇమ్మడి పరమేశ్, ఉప్పు శేఖర్, లింగప్ప, కోటయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎంవీఆర్ విద్యాసంస్థల భవనం ప్రారంభం

నల్లగొండ: విద్యార్థుల కోసం అన్ని వసతులతో ఎంవీఆర్ విద్యాసంస్థల యాజమాన్యం నూతన భవనం నిర్మించడం అభినందనీయమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని శాంతినగర్‌లో ఎంవీఆర్ విద్యాసంస్థల నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, డీఈఓ భిక్షపతి, ఎంవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్, కరస్పాండెంట్ గీత, ప్రిన్సిపాల్ కళ్యాణ శ్రీనివాసరావు, విద్యాసంస్థల ప్రిన్సిపాల్ రఘునందన్‌రెడ్డి, ఐఐటీ ఫౌండేషన్ అడ్మిన్ అహ్మద్ అలీ, ఫణి కుమార్, కర్నాటి విజయ్‌కుమార్, బండారు ప్రసాద్, కర్నాటి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండలోని బీట్ మార్కెట్‌లో గల వెజ్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ తదితరులు



ఎన్జీ కళాశాల వద్ద దుకాణాలను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్



ఎంవీఆర్ విద్యాసంస్థల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన

క్లుప్తంగా

మంత్రి కోమటిరెడ్డికి సన్మానం



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న యువజన నాయకులు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని ఎంవీఆర్ స్కూల్ ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బుధవారం 6వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కంచరకుంట్ల చంద్రశేఖర్‌రెడ్డి, కంకణాల లింగారెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి లోకేశ్వర్‌రెడ్డి, ఎం. సురేందర్‌రెడ్డి, ఎం. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సన్మానించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండటౌన్: తెలంగాణ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (టీఎస్‌ఎంఇఎస్‌ఎ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం నల్లగొండ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రికి మైనార్టీ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్, డాక్టర్ ఏఏ ఖాన్, ముహమ్మద్ అబ్దుల్ అలీమ్, ప్రొఫెసర్ సయ్యద్ అలీ, డి.ఐ. రాజు, ముహమ్మద్ సుఫియానుద్దీన్, ముహమ్మద్ అబ్దుల్ పర్వేజ్, ముహమ్మద్ హఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

వేముల రోహిత్‌కు నివాళి

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతూ అక్కడ జరుగుతున్న వివక్షతకు ఎదురొడ్డి నిలిచిన మహోన్నత వ్యక్తి వేముల రోహిత్ అని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు పందుల సైదులు అన్నారు. బుధవారం వేముల రోహిత్ వర్ధంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో గల తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాదె నర్సింహ, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నకిరేకల్: నకిరేకల్‌ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్–1 గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలవారు ఈ నెల 20వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 22వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. నీట్, సెట్, పీహెచ్‌డీతో పాటు బోధనా అనుభవం ఉన్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులు చేసుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పీజీలో 50 శాతం, ఓసీ, బీసీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు ఉండాలని సూచించారు.

సాయుధ పోరాట యోధుడు సత్తయ్య విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన కొమ్ము సత్తయ్య విగ్రహం

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధి గంగదేవిగూడెం బస్‌షెల్టర్ ముందున్న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం నాయకుడు కొమ్ము సత్తయ్య విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మించి కొమ్ము సత్తయ్య విగ్రహం ఏర్పాటు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో కూడా రెండు సార్లు విగ్రహాన్ని ధ్వంసం చేశారని పేర్కొన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సత్తయ్య కుమారుడు కొమ్ము యదయ్య తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత

మునుగోడు: మండల పరిధిలోని కిష్టాపురం గ్రామ పంచాయతీకి చెందిన బోయ లింగస్వామి గ్రామంలోని యువతీ, యువకులకు బుధవారం ఉచితంగా క్రీడా సామగ్రి అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలనే ఉద్దేశంతో తన సొంత ఖర్చులతో క్రీడా సామగ్రి అందజేసినట్లు లింగస్వామి తెలిపారు.

నిరుపేద విద్యార్థినికి మంత్రి ఆర్థికసాయం

నల్లగొండ: నిరుపేద విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కర్నాటి శ్రీవిద్య చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి స్పందించి బుధవారం నల్లగొండ పట్టణంలో శ్రీవిద్యకు రూ.50వేలు అందించడమే కాకుండా ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆమె చదువు పూర్తయ్యే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కర్నాటి శ్రీవిద్య మాట్లాడుతూ.. మంత్రి వెంకట్‌రెడ్డి తమ కుటుంబానికి దేవుడితో సమానమని చెప్పింది. ఆర్థిక ఇబ్బందులతో ఎక్కడ తన చదువు ఆగిపోతుందేమోనని భయపడుతున్న సమయంలో మంత్రి మంచి మనసుతో సహాయం చేశారని, వారికి రుణపడి ఉంటానని తెలిపింది.



శ్రీవిద్యకు ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి

ఎంపీఎల్ విస్తరణను నిలిపివేయాలని వినతి



కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం ఇస్తున్న వెలిమినేడు గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణను నిలిపివేయాలని, ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు బుధవారం ఆ గ్రామస్తులు కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం అధ్యక్షుడు బైకాని నాగరాజు, నెల్లికంటి నర్సింహారెడ్డి, ఏర్పుల శ్రీశైలం, దుర్గం లింగస్వామి, తాటికొండ రాజు, బైకాని మహేష్ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణను నిలిపివేయాలని వెలిమినేడు గ్రామానికి చెందిన ఆదర్శ యువజన సంఘం సభ్యులు కొమ్మగాని భిక్షం, నాతి సతీష్, నాతి రాజు చిట్యాల తహసీల్దార్ దశరథకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ నెల 19వ తేదీన ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణకు సంబంధించి జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలని వెలిమినేడు గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్రూరి శ్రీశైలం అధికారులను కోరారు.

సీపీఎం కార్యదర్శిగా పామనగుళ్ల దశరథ

చిట్యాల: మండల పరిధిలోని తాళ్లవెల్లెంల గ్రామ సీపీఎం పార్టీ కార్యదర్శిగా పామనగుళ్ల దశరథ ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం జ్యోతిబసు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, నాయకులు పామనగుళ్ల అచ్చాలు, నకిరేకంటి రాములు, కట్ట వెంకటేశం, కొమ్మనపల్లి గోపాల్, దొడ్డి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం, బియ్యం అందజేస్తున్న నాయకులు

మర్రిగూడ: మండలంలోని ఖుదాబక్షపల్లి గ్రామానికి చెందిన సిరగోని మారయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ గ్రామశాఖ అధ్యక్షుడు బూడిద సురేష్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.3,500 నగదు, 50కేజీల బియ్యాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి ఇస్కిల మహేందర్, సీపీఐ నాయకులు రాపోతు ముత్తయ్య, పొట్ట అశోక్, గోగు శేఖర్, సిరిపంగి శ్రీను, పొట్ట గిరి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

మిర్యాలగూడ అర్బన్: చెక్కు బౌన్స్‌కేసులో ఒక వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.3.95లక్షల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల బుధవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. నల్లగొండ జిల్లా పానగల్లు గ్రామానికి చెందిన చింత యల్లయ్య తన అవసరాల నిమిత్తం ఫిబ్రవరి 24, 2018న రూ.3లక్షలు అప్పుగా తీసుకుని అందుకు రూ.3లక్షల చెక్కును తండు నగేశ్ పేరుమీద రాసి ఇచ్చాడు. ఆ చెక్కు గడువు తేదీ బ్యాంకులో వేయగా ఆ ఖాతాలో నగదు లేదని చెక్కు వాపస్‌వచ్చింది. దీంతో కోర్టులో కేసు వేయగా ఇరుపక్షాల వాదనలు విని అనంతరం కోర్టు పై తీర్పును వెలువరించింది.

పెరిగిన వాహనాల రద్దీ

మాడుగులపల్లి: అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై బుధవారం వాహనాల రద్దీ పెరిగింది. సంక్రాంతి సెలవులు ముగియడంతో పండుగకు సొంతూళ్లకు వెళ్లిన వారు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావడంతో రహదారిపై ట్రాఫిక్ నెలకొంది. మాడుగులపల్లి టోల్‌ప్లాజాలోని నార్కట్‌పల్లి రహదారి వైపు ఉన్న 3టోల్‌బూత్‌లకు ఫాస్టాగ్ సిస్టమ్ ఉండడంతో సెకన్ల వ్యవధిలోనే వాహనాలు టోల్ గేట్‌ను దాటుతున్నాయి. బుధవారం గంటకు వెయ్యికిపైగా వాహనాలు హైదరాబాద్ వైపు ప్రయాణం చేసినటుల్ టోల్‌ప్లాజా అధికారులు పేర్కొన్నారు.

బహుమతుల ప్రదానం

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శివశెట్టి నిమ్మయ్య–అన్నమ్మ స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు బుధవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుడు శివశెట్టి అంజయ్య షీల్డ్స్‌తో పాటు మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండవ బహుమతిగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రత్నం పుష్ప, ఉప సర్పంచ్ రాచకొండ శ్రీనివాస్, శివశెట్టి గౌరయ్య, శివశెట్టి వెంకట్, శివశెట్టి విక్రం, చెరుకు ప్రవీణ్, పంతంగి రంగారావు, భీమిడి సంజీవరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా



బస్‌పాస్‌లు అందజేసిన కాంగ్రెస్ నాయకులు

మర్రిగూడ: మండలంలోని ఖుదాబక్షపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్ మాట్లాడుతూ.. మండలంలోని దివ్యాంగులంతా ప్రభుత్వం అందించే ఉచిత బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నడ్డి విఠల్‌రెడ్డి, నర్సింగ్ యాదయ్యగౌడ్, పోతురాజు ఆంజనేయులు, కొట్టం శ్రీనివాస్‌యాదవ్, ఊరిపక్క జంగయ్య, కొర్ర శ్రీను, సున్నం యాదయ్య, మాదగోని రవి, బట్టు రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన దుండగులను శిక్షించాలి

మిర్యాలగూడ: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ నాయకులు కోల సైదులు, మహేష్‌గౌడ్, దాసరాజు జయరాజు అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద జయశంకర్ చిత్రపటానికి వారు నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు దశ–దిశ చూపిన జయశంకర్ విగ్రహాన్ని కూల్చడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన వారిని కఠినంగా శిక్షించి తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సుధాకర్, వెంకటేశ్వర్లు, ఈశ్వరాచారి, ఏడుకొండలుతో పాటు బంజారా ఉద్యోగుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్, మోసిన్‌అలీ, బంటు కవిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న పీవీ శ్యాంసుందర్‌రావు తదితరులు

కట్టంగూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. బుధవారం కట్టంగూర్ మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉజ్వల గ్యాస్, సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ముద్ర లోన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా 18 రకాల చేతివృత్తుల వారు లబ్ధి పొందవచ్చని తెలిపారు. అనంతరం పీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచితంగా వాటర్ క్యాన్‌లను ఆయన పంపిణీ చేశారు. పీఆర్ ఫౌండేషన్ ద్వారా కేంద్ర పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నకిరేకంటి మొగులయ్య, జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, యువ మోర్చా అధ్యక్షుడు ఏలూరు శ్యామ్, పసుల సైదులు, ముడుసు భిక్షపతి, గున్నాల నాగరాజు, ఎస్‌బీఐ మేనేజర్ వీరబాబు ఉన్నారు.

అయోధ్య రామమందిరం అక్షింతల పంపిణీ



కట్టంగూర్: చెర్వుఅన్నారంలో అక్షింతలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



మర్రిగూడలో అయోధ్య అక్షింతలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కట్టంగూర్: మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో అయోధ్య రామమందిరం అక్షింతలను బుధవారం బీజేపీ నాయకులు, భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గున్నాల నాగరాజు, చిలుముల సైదులు, ఎడ్ల రాములు, పొడిచేటి రాంబాబు, దెండె సైదులు, చెవుగోని రవి, తేలు ప్రశాంత్, కక్కిరేణి నరేష్ ఉన్నారు.

మర్రిగూడ మండలంలో..

మర్రిగూడ: అయోధ్య అక్షింతలను మర్రిగూడ మండల కేంద్రంతో పాటు వెంకేపల్లి తండాలో బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకుడు ఎల్‌వీ శర్మ, సర్పంచ్ నల్ల యాదయ్య, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్, చెరుకు శ్రీరాములు, పగడాల రఘు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

మర్రిగూడ: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయడంలో గ్రామాల్లోని బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌ఓ) బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మర్రిగూడ తహసీల్దార్ బక్కా శ్రీనివాసులు అన్నారు. బుధవారం మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22 వరకు నూతన ఓటర్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 20, 21న బీఎల్‌ఓలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ బషీర్‌అలీ, కార్యాలయ సిబ్బంది రమేష్, మధు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

అలరించిన అన్నమయ్య కీర్తనలు



ప్రశంసా పత్రాలు అందుకున్న చిన్నారులు

నకిరేకల్: అన్నమయ్య కళాసమితి నకిరేకల్ అధ్యక్షురాలు సుమలత ఆధ్వర్యంలో పట్టణంలోని ఐశ్వర్య సాయి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన అన్నమయ్య పదసుమార్చనం కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. హైదరాబాద్, మెదక్, కరీంనగర్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల నుంచి విచ్చేసిన నాలుగేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు చిన్నారులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా కీర్తనలు ఆలపించిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాధవి వెల్లంకి వాఖ్యాతగా వ్యహరించారు. సినీ సంగీత దర్శకులు సాలూరి వాసురావు, స్వర వీణాపాణి, రవివర్మ పోతేదార్‌తో పాటు జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఎం. పురుషోత్తమాచార్యులు, కవయిత్రిలు రోజాదేవి, కొడపల్లి నివారిణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చిట్యాల: మండలంలోని బోయగుబ్బ గ్రామానికి చెందిన బొల్లం లింగయ్య నివాసముంటున్న గుడిసె వారం రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటి నిర్మాణానికి కోసం దాచుకున్న రూ.5లక్షల నగదుతో పాటు బంగారం, వెండి వస్తువులు, నిత్యావసర సరుకులు కాలిబూడిదయ్యాయి. బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బాధితుడు లింగయ్యను పరామర్శించారు. లింగయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, జిల్లా కాంగ్రెస్ నాయకులు కంచర్ల వెంకట్‌రెడ్డి, పోకల దేవదాసు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, మండల నాయకులు జడల చినమల్లయ్య, బట్టు అయిలేష్, రుద్రారపు శ్రీను పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ పత్రాల అందజేత..

మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన మంత్రి సుమలత మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.3లక్షలకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బాధితురాలి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.



లింగయ్యను పరామర్శిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

ముగిసిన వైపీఎల్ క్రికెట్ టోర్నమెంట్

మర్రిగూడ: సంక్రాంతి పండుగ సందర్భగా మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ రియల్ ఎస్టేట్ సహకారంతో వల్లంల సంతోష్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యరగండ్లపల్లి ప్రీమియర్ లీగ్(వైపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు సంతోష్‌యాదవ్ ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యరగండల్లపల్లి గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వల్లంల సంతోష్‌యాదవ్